ఆంధ్రజ్యోతి




5 జయశంకర్ భూపాలపల్లి

శనివారం 22 ఫిబ్రవరి 2025

కాల్వ పారదు మడి తడవదు!

- లక్నవరం ఆధునికీకరణకు మోక్షమెప్పుడో?
- లీకేజీలతో వృథాగా పోతున్న జలాలు
- పంట కాల్వలకు భారీగా గండ్లు
- పేరుకుపోయిన పూడిక, పిచ్చిమొక్కలు
- ఏటా ఎండుతున్న చివరి ఆయకట్టు
- రూ.300 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- నిధుల కేటాయింపులో జాప్యం



లక్నవరం తూములకు మరమ్మతు చేస్తున్న కార్మికులు(ఫైల్)

గోవిందరావుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పర్యాటకంగా సరికొత్త అందాలను సంతరించుకుంటున్న లక్నవరం చెరువు ప్రకృతి ప్రేమికులను ఆహ్లాదపరుస్తోంది కానీ.. నమ్ముకున్న రైతులకు మాత్రం ఆనందం కరువుతోంది. ఈ చెరువు నుంచి పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందరి పరిస్థితి ఉంది. ఏళ్ల కాలంగా తూముల లీకేజీలు వెంటాడుతుండగా విలువైన జలాలు వృథాగా పోతున్నాయి. పంటకాల్వలు తెగి జల్లెడలా మారడంతో చివరి ఆయకట్టుకు నీరందక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తూముల మరమ్మతు, కాల్వల ఆధునీకరణ కోసం నీటిపారుదల శాఖ ప్రభుత్వానికి సమర్పించిన ప్రతిపాదనలకు మోక్షం లభించడం లేదు.

కాకతీయ రాజులు 800 ఏళ్ల క్రితం లక్నవరం చెరువును 5,555 హెక్టార్ల విస్తీర్ణంలో నిర్మించారు. ముందుచూపుతో వ్యవహరించి స్థానికంగా వర్షాభావ పరిస్థితులు ఎదురైనప్పటికీ ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాల వరద లక్నవరం సరస్సులోకి చేరేలా ఏర్పాట్లు చేశారు. సరస్సు నీటి నిల్వ సామర్థ్యం 2.1 టీఎంసీలు. ఆయ కట్టులో అధికారికంగా 8,794 ఎకరాలు, అనధికారికంగా మరో 3వేల ఎకరాల భూములు సాగవుతు న్నాయి. అనాదిగా రైతులు ఇక్కడ వరిసాగే జీవనాధారంగా చేసుకున్నారు. ఆయకట్టు మొత్తానికి నీటి ని అందించేందుకోసం 80 కిలోమీటర్ల మేర రంగాపూర్, కోట, శ్రీరాంపతి, నర్సింహుల-1, నర్సింహుల-2 వంటి మొత్తం ఐదు కాల్వలను నిర్మించారు. ఖరీఫ్‌లో పూర్తి ఆయకట్టు సాగులోకి వస్తుంది. రబీలో మాత్రం సరస్సులో నీటి మట్టానికి అనుగు ణంగా రొటేషన్ పద్ధతిలో టైబందీని ప్రకటిస్తారు.



లక్నవరం చెరువు



పిచ్చిచెట్లు, పూడికతో మూసుకుపోయిన కాల్వలు

తూములు శిథిలం.. కాల్వలకు గండ్లు

నైజాం పాలనా కాలంలో చివరిసారిగా మరమ్మతు జరిగిన లక్నవరం తూములు కాలక్రమంలో శిథిలమైపోయాయి. ఏటా వర్షాలు, వరదలకు కాల్వలు కూడా ఎక్కడికక్కడ తెగిపోయాయి. చెరువులో పూడిక తీయకపోవడంతో సుమారు లక్ష క్యూబిక్ మీటర్ల మేర ఒండ్రుమట్టి పేరుకుపోయింది. కాల్వలు కూడా గడ్డి, పిచ్చిమొక్కలతో పూడుకుపోయాయి. తూముల నుంచి భారీగా నీరు బయటకు వచ్చి సద్దిమడుగు గుండా కిందకు ప్రవహిస్తోంది. ఇలా ప్రతీ పంటకాలంలో 150 ఘనపుటడుగుల మేర నీరు వృథాగా పోతోంది. ఈ నీరు వెయ్యి ఎకరాలను సాగులోకి తెస్తుందని అంచనా. సరస్సు నీటిమట్టానికి అనుగుణంగా ప్రకటించిన టైబందీ ప్రకారంగా రైతులు నాటు వేసుకుంటే లీకేజీలతో ముందే నీరు అడుగంటి చివరి ఆయకట్టుకు అందడంలేదు. దీంతో ప్రతీసారి సుమారు వందల ఎకరాల వరిపంట ఎండిపోయి రైతులు నష్టపోతున్నారు. తూముల నుంచి విడుదల చేసిన నీటిని కాల్వలకు మళ్లించేందుకోసం సద్దిమడుగే ప్రధానం. బాలెన్స్ రిజర్వాయర్‌గా పనిచేసే ఈ సద్దిమడుగు కూడా శిథిలమైపోయింది. 5ఎంసీఎఫ్‌టీ నీటినిల్వ సామర్థ్యం కలిగిన సద్దిమడుగు కట్టను బలోపేతం చేయడంతోపాటు షెట్టర్లను నిర్మించాల్సి ఉంది.

రూ.300 కోట్లతో ప్రతిపాదనలు..

తూముల లీకేజీలు, కాల్వలకు గండ్లతో పంటలు ఎండిపోతున్న తీరు, పెరుగుతున్న నష్టం దృష్ట్యా రైతుల డిమాండ్ మేరకు ములుగు జిల్లా నీటిపారుదల శాఖాధికారులు క్యాడ్‌వామ్(సీఏడీడబ్ల్యూఎం) పథకంలో భాగంగా 2017లో రూ.20కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించారు. ఎటువంటి స్పందన కనిపించలేదు. ఏళ్ల గడుస్తున్నా కొద్దీ కాల్వలు, తూములు ధ్వంసం కావడం, వ్యయం అంతకంతకూ పెరగడంతో రెండేళ్లక్రితం సమగ్ర సర్వే చేసిన అధికారులు రూ.300 కోట్లతో మరోసారి ప్రతిపాదనలు అందించారు. తూములకు స్కిన్‌వాల్ నిర్మించడంతోపాటు పంట కాల్వల్లో 80 కిలోమీటర్ల మేర గైడ్‌వాల్, వరద కాల్వలకు మత్తళ్లు, డ్రైనేజీ, కట్టల బలోపేతం, దుంపెల్లిగూడెం నుంచి బుస్సాపురం మీదుగా రంగాపూర్

మిగతా 8వ పేజీలో...

ఎన్నికల్లో పొరపాట్లకు తావివ్వొద్దు

- ములుగు కలెక్టర్ దివాకర

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై పీవో, ఏపీవో, సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27వ తేదీన జరిగే వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. శుక్రవారం ములుగులోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు నియమించబడిన పీవో, ఏపీవో, సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం జరుగగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శిక్షణ తరగతులను ఆకళింపు చేసుకుని ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇదివరకు నిర్వహించిన ఎన్నికల విధులే కదా.. అని శిక్షణ తరగతులను తేలికగా తీసుకోకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు సంబంధించిన ప్రతీ ఒక్క అంశాన్ని తెలుసుకోవాలని సూచించారు. ప్రధానంగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే శాసనమండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొంత భిన్నంగా ఉంటుందని అన్నారు. బ్యాలెట్ పద్ధతిన జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియలో ఓటింగ్ నిర్వహణకు ఒకింత ఎక్కువ వ్యవధి పట్టే అవకాశాలు ఉన్నందున ఓపిగ్గా, సంయమనంతో వ్యవహరిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. 27వ తేదీన ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందని, గడువులోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూలైన్‌లో ఉన్నవారికి వరుసక్రమంలో టోకెన్ నంబర్లు అందించి వారిచే ఓటింగ్ జరిపించాలన్నారు. పోలింగ్‌కు ఒకరోజు ముందుగానే ఈనెల 26వ తేదీన ఉదయం 8గంటలకు ప్రిసైడింగ్ అధికారులు తమ బృందంతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. పంపిణీ కేంద్రాల వద్ద అందించే పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సులను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, చెక్‌లిస్టులో పొందుపరిచిన దానికి అనుగుణంగా మెటీరియల్

మిగతా 8వ పేజీలో...

పలుగుల అడవుల్లోనే పులి

- 12 రోజులుగా వణుకుతున్న జనం
- నాలుగు బృందాలుగా తనిఖీలు
- గాలింపులో 30 మంది అధికారులు



వివరాలు 6వ పేజీలో..

కన్నోళ్లకు కడుపు కోత

- రోడ్డుప్రమాదంలో అన్నదమ్ముల దుర్మరణం
- బైక్‌ను ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం
- కంఠాత్మకూర్‌లో ఘటన.. మృతులది మల్హర్ మండలం



ఘటనా స్థలంలో ఉప్పుల రాజ్‌కుమార్ మృతదేహం, రాజ్‌కుమార్, శంకర్ (ఫైల్)



నడికూడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : వారిద్దరూ అన్నదమ్ములు.. ఒకరు నగరంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా.. మరొకరు ఐటీఐ చదువుతున్నారు. వారిద్దరిని తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారు. అయితే విధి వారిద్దరినీ బలితీసుకుంది. ఇంటికి వెళదామని సంతోషంగా వెళుతున్న వారి ద్విచక్ర వాహనాన్ని ఓ గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృత్యువాత పడ్డారు. ఒకే కుటుంబంలో ఇద్దరు మరణించడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ప్రమాదం హనుమకొండ జిల్లా నడికూడ మండలం కంఠాత్మకూర్‌లో శుక్రవారం జరిగింది. దామెర పోలీసుల వివరాల ప్రకారం... భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం నాచారం గ్రామానికి చెందిన ఉప్పుల చంద్రం వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. చంద్రంకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉప్పుల రాజ్‌కుమార్ (25) హనుమకొండలో ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా, ఉప్పుల శంకర్ (22) ఐటీఐ సెకండియర్ చదువుతున్నాడు. ఇద్దరు కుమారులు హనుమకొండలో వేర్వేరుగా ఉంటున్నారు. గురువారం రాత్రి 11 గంటల తర్వాత తమ స్నేహితుడైన బండారి శివకుమార్‌తో కలిసి ముగ్గురు ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నాచారానికి బయలుదేరారు. శుక్రవారం తెల్లవారుజామున సుమారు 1.30 తర్వాత నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్దకు చేరుకోగానే గుర్తుతెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఉప్పుల రాజ్‌కుమార్ బైక్‌పై నుంచి ఎగిరి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉప్పుల శంకర్, బండారి శివకుమార్‌లను 108 లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో శంకర్ మృతి చెందాడు. ప్రస్తుతం శివకుమార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, మృతుల తండ్రి చంద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు దామెర ఎస్ఐ కొంక అశోక్ తెలిపారు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

నాచారంలో విషాదం..

మల్హర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందడంతో మండలంలోని నాచారంలో విషాదం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం... నాచారం గ్రామానికి చెందిన ఉప్పుల చంద్రం-జయ దంపతులకు రాజ్‌కుమార్, శంకర్ కుమారులు. వీరిద్దరిలో పెద్దవాడైన రాజ్‌కుమార్ హనుమకొండలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, చిన్నవాడైన శంకర్ ఐటీఐ చదువుతున్నాడు. తల్లిదండ్రులు గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం రాత్రి రాజ్‌కుమార్, శంకర్‌లు మరో మిత్రుడితో కలిసి ద్విచక్ర వాహనంపై నాచారం గ్రామానికి వస్తుండగా హనుమకొండ జిల్లా నడికూడ మండలం కంఠాత్మకూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందారు. అందరితో కలివిడిగా ఉండే అన్నదమ్ములు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

సీసీఐ కేంద్రాలు పునఃప్రారంభం

మిల్లుల వద్ద పత్తి వాహనాల బారులు

వివరాలు 8వ పేజీలో

గురుకులంలో కలెక్టర్ నిద్ర

- విద్యార్థులతో కలిసి భోజనం
- సౌకర్యాల గురించి తెలుసుకున్న రాహుల్‌శర్మ
- 'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర గురుకుల విద్యాలయాన్ని శుక్రవారం రాత్రి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన 7గంటలకు గురుకులానికి చేరుకోవడంతో విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వంటగదికి చేరుకుని వంటలను పరిశీలించారు. విద్యార్థులతో కూర్చొని భోజనం చేస్తూ నూతన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, వంటలు రుచికరంగా ఉంటున్నాయా, పరిశుభ్రత ఎలా ఉంది, వాటర్ సౌకర్యం ఉందా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే 9గంటలకు పదవ తరగతి విద్యార్థులు స్టడీ అవర్‌లో కూర్చొని వారికి ఆయా సబ్జెక్టుల్లో వచ్చిన సందేహాలను నివృత్తి చేశారు. అంతేకాకుండా గంటసేపు ట్యూటరీ చెప్పారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదివి తల్లిదండ్రులు, గ్రామానికి, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

విద్యతోపాటు క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని, ఇతరులతో పోటీ కాకుడా మీతో మీరే పోటీ పడాలన్నారు. పరీక్షలంటే భయం లేకుండా మానసికంగా సిద్ధం కావాలని సూచించారు. ఐఏఎస్ అధికారిగా ప్రజలకు సేవలందిస్తానని చెప్పిన షణ్ముక్ అనే విద్యార్థిని ఆయన అభినందించారు. అనంతరం రాత్రి 10గంటలకు పదో తరగతి విద్యార్థులతో కలిసి నిద్ర చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సునీత, మండల స్పెషలాఫీసర్ సునీత, ఎంపీడీవో హుస్సేన్, గురుకులం ప్రిన్సిపాల్ శారదతోపాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

పోలీసుల అదుపులో ఒకరు



తొర్రూరు మండలం మడిపల్లి గ్రామ శివారులో గుప్తనిధుల కోసం జరిపిన తవ్వకాలు



గుప్తనిధుల కోసం తవ్వకాల కోసం తీసుకువచ్చిన పూజ సామగ్రి

తొర్రూరురూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : గుప్తనిధుల కోసం అనుమానాస్పదంగా తవ్వకాలు జరిగిన సంఘటన తొర్రూరు మండలం మడిపల్లి గ్రామ శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మడిపల్లి గ్రామ శివారు ఇటుకబట్టీల సమీపంలోని ఓ బావి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరుపుతుండగా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, గ్రామస్థులు అప్రమత్తమై సంఘట స్థలానికి చేరుకోగా తవ్వకాల్లో నిమగ్నమైన ఐదుగురు వ్యక్తులు పరారీకి ప్రయత్నించగా అందులో జెల్ల వెంకన్న అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. నెల్లికుదురు మండలం క్యాంపు తండాకు చెందిన సురేష్ అతని అనుచరులు పార, గడ్డపార, పూజసామగ్రి గుమ్మడికాయ, పసుపు, కుంకుమ్మ, నవధాన్యాలుతో వచ్చి తవ్వకాలు ప్రారంభించినట్లు తెలిపారు. గుప్తనిధుల తవ్వకాల వెనుక ఎవ్వరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని, వెంకన్నపై కేసు నమోదు చేసి, మరో నలుగురి కోసం గాలింపులు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

పలుగుల అడవుల్లోనే పులి

● 12 రోజులుగా జంకుతున్న జనం ● నాలుగు బృందాలుగా తనిఖీలు ● 30 మంది అధికారుల బృందం గాలింపు



అన్నారం గ్రావిటీ కాల్వ వద్ద, పలుగుల అడవిలో గుర్తించిన పులి పాదముద్రలు

మహదేవపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండల ప్రజలు గత 12 రోజులుగా పెద్ద పులి భయంతో జంకుతున్నారు. కాటారం మండలం నస్తూరుపల్లి, గూడూరు, గుండ్రాతిపల్లి అడవులలో 12 రోజుల నుంచి మగ పులి ఆడ పులి కోసం సంచారం చేస్తుంది. ఇప్పటికే పలు సీసీ కెమెరాలు ఫారెస్టు అధికారులు బిగించినా పులి ఆనవాళ్ల తెలియడం లేదు. రోజుకో ప్రాంతంలో తిరుగుతున్నట్లు పులి పాదాలను అధికారులు గుర్తించారు. అయినప్పటికి నాలుగు బృందాలుగా ఏర్పాటై అధికారులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. సరైన జాడ దొరకకపోవడంతో రైతులు, అడవికి పశువుల కాపరులు వెళ్లకుండా భయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం ఉదయం గ్రావిటి కాల్వ దాటి కాళేశ్వరం అడవులకు వచ్చిందని, పాద ముద్రలతో ఫారెస్టు అధికారులు గుర్తు పట్టారు. గత రెండు సంవత్సరాల నుంచి మగ పులి ఆడ పులి కోసం వేట మొదలు పెట్టడం జరుగుతోంది. కొన్ని రోజుల తర్వాత ఆడ పులి జాడ కనపడక గోదావరి దాటి మహారాష్ట్ర వైపు వెళుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. మరికొంత మంది నీటి తావు ఎక్కడ ఉంటే అక్కడ పులి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా 12 రోజుల నుంచి రెండు మం డలాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఒకవైపు మిర్చి పంట చేతికి వచ్చినందున రైతులు పంట పొలాలకు వెళ్లక తప్పడం లేదు. మరోవైపు పులి ఎప్పుడు దాడి చేస్తుందనే భయంతో పలు గ్రామాల ప్రజలు జంకుతున్నారు. అదిలాబాద్ నుంచి వచ్చిన యానిమల్ ట్రాకింగ్ టీం సభ్యులు పులి పగ్ మార్క్‌లను పరిశీలిస్తున్నారు. మహదేవపూర్ మండలంలో పెద్ద పులి తిరుగుతుందన్న వార్తతో జనం భయం గుప్పిట్లో గడుపుతున్నారు. కుంటలు, వాగులు, ఒర్రెల వద్ద పులి పాదముద్రలు గుర్తించారు. మహదేవపూర్ మండలంలో పలుగుల ఇసుక క్వారీల వైపు కూడా ఎవరూ వెళ్లడం లేదు. ఇసుక క్వారీల వైపు పులి అడుగులు ఏర్పడడంతో జనం జంకు తున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పంట పొలాల వద్దకు వెళ్లవద్దని అధికారులు సూచి స్తుండగా తమ పంటలు చేతికొచ్చాయని, పంటలు ఎండిపోతున్నాయని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

● జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా మార్చి 8న జరిగే జాతీయ లోక్ ఆదాలత్ ను విజయవంతం చేయాలని మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం పోలీస్ అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా కోర్టుల్లో వేల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అన్ని కేసులను సాధారణ పద్దతిలో పరిష్కరించడం సాధ్యం కాదని, అందుకనే జాతీయ లోక్ ఆదాలత్‌ను వినియోగించుకుని రాజీపడగలిగే కేసులను రాజీ మార్గం ద్వార పరిష్కరించుకోవచ్చన్నారు. అందులో క్రిమినల్, సివిల్, భూతగాద, మోటార్ వాహనప్రమాదం, వివాహ, కుటుంబ, తగాద కేసులు, బ్యాంకు చెక్‌బౌన్స్, విద్యుత్‌శాఖ, చిట్‌ఫండ్స్ ఇన్సూరెన్స్, ఎక్సైజ్, ట్రాఫిక్, చోరీ కేసులు, ఈ చలాన్ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో సీనియర్ సివిల్ జడ్జి సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, డీఎస్పీలు తిరుపతిరావు, కృష్ణకిశోర్, డీఏవో రజిని, బాలకిషన్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని డీపీవో హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం తొర్రూరు మండలం నాంచారి మడూరు గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి, వాటర్ మెన్‌తో తాగునీటి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మేరకు పైపు లైన్లు మరమ్మతు చేయడంతో పాటు, తాగునీటి సరఫరాకు ముందుస్తుగా చర్యలు తీసుకోవాలి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణచందర్, పంచాయతీ కార్యదర్శి సతీష్, వాటర్‌మెన్ రాజు పాల్గొన్నారు.

అందుబాటులో లేని 'కార్మిక' అధికారి

ఇబ్బందులు పడుతున్న ప్రజలు



అధికారి కోసం కార్యాలయం వద్ద ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

తొర్రూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు డివిజన్ కేంద్రంలోని కార్మిక శాఖ సహాయ లేబర్ అధికారి అందుబాటులో లేకపోవడంతో ప్రజలు, కార్యాలయానికి వచ్చే లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని 18 మండలాలకు గాను తొర్రూరులో, మానుకోటలో లేబర్ అధికారి కార్యాలయాలు ఉన్నాయి. తొర్రూరు పరిధిలో 11 మండలాలకు చెందిన సంఘటిత, అసంఘటిత, తాపీ మేస్త్రీ, రోజువారి కూలీలు, రేషన్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరూ కార్యాలయానికి వస్తుంటారు. కార్యాలయంలో సహాయ లేబర్ అధికారి ఒక్కడే ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఉన్నతాధికారులు సమావేశాలకు, ఫీల్డ్ విజిట్‌లకు వెళ్లిన నేపథ్యంలో కార్యాలయానికి వచ్చిన వారికి సమాధానం చెప్పే వారు కరువయ్యారు. శుక్రవారం వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులు కార్యాలయానికి రావడంతో తాను అందుబాటులో లేనని, కార్యాలయం ఎదుట నోటీస్ బోర్డు అంటించి వెళ్లడంతో పలువురు ఆ ఫోటోలను వాట్సాప్ గ్రూప్‌లలో వైరల్ చేశారు. దీనిపై అధికారిని ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'పాతపెన్షన్' కోసం 2న హైదరాబాద్‌లో యుద్ధభేరి



యుద్ధభేరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పాతపెన్షన్ విధానాన్ని అమలు పర్చాలని డిమాండ్‌తో మార్చి 2న టీఎస్ సీపీఎస్‌యూ ఆధ్వర్యంలో హైదరాబాద్ ధర్నాచౌక్ వద్ద మార్చి 2న జరుపతలపెట్టిన యుద్ధభేరికి భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్కే. మొబైల్ అహ్మద్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం యుద్ధభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ మహమ్మరీ నుంచి విముక్తి కల్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండి వైఖరీ విడనాడి కామన్ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్డీ. రఫిక్, బా నోత్ రవీందర్, సింగు రమేష్, గుగులోతు రవీందర్‌నాయక్, కిషోర్, శ్రీదేవి, శ్రీనివాస్, రూప, ప్రియాంక, భరత్, రమేష్, సుధాకర్, కిరణ్, మమ్ముట్టి పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలి

తొర్రూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలని తొర్రూరు డిపో మేనేజర్ పద్మావతి అన్నారు. శుక్రవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు తొర్రూరు ఆర్టీసీ డిపోలో నాలుగు రోజులుగా ఉద్యోగులకు పవర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగులు రాణించేందుకు నైపుణ్య శిక్షణలో భాగంగా వృత్తి పరమైన సవాళ్లను ఎదుర్కొనేందుకు ఈ శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు సమయ పాలన పాటిస్తూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. అనంతరం శిక్షణలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతి ప్రదానం, క్రమ శిక్షణతో విధులు నిర్వహించాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ రజిత, ఎంఎఫ్ విజయ్‌కుమార్, ఏడీసీలు, ఆర్టీసీ కార్మికులు తదితరులు ఉన్నారు.

దేవాదులలో మరో రెండు మోటార్లు ఆన్



ఫేజ్-3లో ఆన్ చేసిన మోటార్లు

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నుంచి శుక్రవారం మరో రెండు మోటార్లను ఆన్ చేశారు. గురువారం వరకు ఫేజ్-2లో ఒకటి, ఫేజ్-3 నుంచి రెండు మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేసిన అధికారులు శుక్రవారం ఫేజ్-3లో మరో రెండు మోటార్లను ఆన్ చేసి మొత్తం ఐదు మోటార్ల ద్వారా 1,414 క్యూసెక్కుల నీటిని భీంఘనపూర్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎగువ నుంచి 2,350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో బ్యారేజీలోని ఒక గేటును ఎత్తి 936 క్యూసెక్కుల నీటిని దిగువకు వ దులుతున్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 6.94 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.88 టీఎంసీల నీళ్ల నిల్వ ఉన్నాయి. దేవాదుల ఇంటెక్‌వెల్ వద్ద 79.40 మీటర్లు నీటిమట్టం నమోదు కాగా, సమ్మక్క సాగర్ వద్ద 79.60 మీటర్ల నీటిమట్టం నమోదు అయినట్లు సీఏడీ డీఈఈ శరత్‌బాబు, ఏఈ సాయిరాంలు సంయుక్తంగా తెలిపారు.

సరోత్తంరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలి

- మాజీ ఎంపీ సీతారాంనాయక్

ములుగు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నిల్లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం ములుగులో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారాంనాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని, సరోత్తంరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించినట్లయితే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. బీజేపీ టీపీయూఎస్ బలపరిచిన అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి ఉపాధ్యాయలోకం, విద్యావంతులు ఆలోచించి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు విజయచందర్‌రెడ్డి, వెన్నంపల్లి పాపన్న, చింతలపూడి భాస్కర్‌రెడ్డి, అజ్మీరా కృష్ణవేణినాయక్, కొత్త సురేందర్, భూక్య జవహర్‌లాల్, శీలమంతుల రవీంద్రచారి, నరేష్, జినుకల కృష్ణాకర్‌రావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, గుగులోత్ స్వరూప, వండ్ల బుచ్చయ్య, రాయంచు నాగరాజు, పైడాకుల మల్లేష్, మార్క సతీష్, లక్ష్మన్, చక్రవర్తి, రాకేష్, శ్రీనివాస్, జనార్దన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

ప్రభుత్వ పాఠశాలకు కొత్త రంగులు

హెచ్‌ఎం సొంత నిధులతో పెయింటింగ్



కొత్త రంగులతో ఉన్న పాఠశాల భవనం

కేసముద్రం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణపురం పీక్లాతండా శివారు బోడగుండ తండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కొత్త రంగులతో కళకళలాడుతోంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణ తన సొంత నిధులు రూ.25 వేలతో పాఠశాలలోని మూడు గదులు, వరండా, ప్రహరీ, వంటగది, జెండా గద్దె, తలుపులు, కిటికీలకు రంగులు వేయించడాన్ని బుధవారం పూర్తి చేశారు. పాఠశాలను తన సొంత ఇల్లులా భావించి రంగులు వేయించడంపట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేసవిలో తాగు నీటి ఎద్దడి నివారణపై సమీక్ష

మరిపెడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగు నీటి ఎద్దడి నివారణపై శుక్రవారం మరిపెడ, చిన్న గూడూరు మండలాలకు చెందిన మిషన్ భగీరథ ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శులు, వాటర్‌మెన్‌లతో ఆయా మండలాల ఎంపీడీవోలు విజయ, రామరావు శుక్రవారం సమీక్ష సవవేశం నిర్వహించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాతో పాటు రక్షిత తాగు నీటి బావులు, పవర్‌బోర్లు, చేతిపంపు వినియోగంపై అవగాహన కలిపించారు. కార్యక్రమంలో డీఈఈ అనూష, ఏఈలు హథిరాం, అవినాశ్, ఎంపీవోలు సోమ్లా, రజినీ వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వాటర్‌మెన్‌లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



చెర్లపాలెం బీసీ వసతి గృహంలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ శాంతికుమార్

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తొర్రూరు మునిసిపల్ కమిషనర్ శాంతికుమార్ ఆదేశించారు. శుక్రవారం తొర్రూరు మండలం చెర్లపాలెం బీసీ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీచేసి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్య అందించుటకు కృషి చేస్తుందన్నారు. వార్డెన్లు పిల్లల ఆరోగ్యం, ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం పరిసర ప్రాంతాలను కలియ తిరుగుతూ డైనింగ్ హాల్, మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు ఉదయం టిఫిన్స్ సాయంత్రం భోజనం పెడుతున్నామని, మధ్యాహ్నం పాఠశాలలోనే భోజనం చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కట్టస్వామి, హెల్త్ అసిస్టెంట్ రాజు. శానిటరీ ఇన్స్పెక్టర్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

గోడపై అటవీ జంతువుల బొమ్మలు

● చిత్రం చెప్పే విశేషాలు



గూడూరు అటవీశాఖ కార్యాలయ గోడలపై వేసిన చిత్రాలివే..

గూడూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్ట్.. జనాన్ని ఆలోచింప చేస్తుందనడంలో డౌటే లేదు. గ్యాలరీలోని ఆర్ట్ వర్క్‌తో పోల్చితే ఓపెన్ ఆర్టే.. మోస్ట్ పవర్‌ఫుల్ అని క్రియేటివ్ పీపుల్ అంటున్నారు. నాలుగు గోడల మధ్య చూపించే పెయింటింగ్స్ కన్నా.. పబ్లిక్ స్థలాల్లో గోడలపై గీసిన, నేరుగా కన్పిస్తున్న బొమ్మలైతేనే ఎక్కువ మంది చూస్తారని చెబుతున్నారు. ప్రజల్లోకి సోషల్ మెసేజ్‌ని సింపుల్‌గా పంపడానికి ఇదే బెస్ట్ ఆప్షన్ అని వివరిస్తున్నారు. గూడూరు అటవీశాఖ కార్యాలయం గోడలపై ఎఫ్‌డీవో చంద్రశేఖర్ ఆదేశాలనుసారం ఎఫ్ఆర్వో సురేష్ కార్యాలయ ప్రహరీపై వన్య ప్రాణులు, ప్రకృతి, పచ్చని ప్రకృతి బొమ్మలు వేయించారు. అచ్చం అటవీ వాతావరణంలో కళ్లకు కట్టినట్లుగా బొమ్మలు కన్పిస్తున్నాయి. అడవి, మనుషులు, వన్యప్రాణులు ప్రకృతిలో కలిసి జీవించామన్న సందేశాన్ని ఇస్తున్నాయి. మొక్కలను, జంతువులను కూడా మనుషులాగే భావించాలని చెప్పడమే ఈ పెయింటింగ్‌ల కాన్సెప్ట్ అని ఎఫ్ఆర్వో సురేష్ తెలిపారు. ప్రజలకు ప్రకృతిపై మరింత అవగాహన కల్పించే కెపాసిటి పెయింటింగ్‌కు ఉందని, జనాన్ని స్వచ్ఛ్ భారత్ మిషన్‌వైపు విజయవంతంగా నడిపించాలని ఈ చిత్రాలను వేయించినట్లు పేర్కొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2370	2100
పల్లికాయ (సూక)	6600	4600
పల్లికాయ (పచ్చిది)	5500	3100
కందులు	7272	5540
పెసళ్లు	7029	4645
పత్తి	6810	5800
కొత్త పత్తి	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13700	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	16500	11500
యూఎస్ 341	13300	11500
దేశీ	26000	20500
ఎల్లో మిర్చి	17000	17000
దీపిక	16400	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

సేవలతో ఉపాధి పొందుతున్న యువత

- మందుల పిచికారీకి గాను ఎకరానికి రూ.500 అద్దె
- వినియోగించుకునేందుకు ముందుకు వస్తున్న రైతులు
- పే లోడ్‌ను బట్టి ఒక్కో డ్రోన్ ఖరీదు రూ 5.లక్షల నుంచి రూ.12 లక్షలు



అద్దెకు వ్యవసాయ డ్రోన్లు

ఉమ్మడి జిల్లాలో అందుబాటులో 15 డ్రోన్లు

హనుమకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో యాంత్రీకరణ పెరుగుతోంది. సాగులో సంచలనాత్మక మార్పుల్లో భాగంగా అందుబాటులోకి వచ్చిన వ్యవసాయడ్రోన్లు.. ఇప్పుడు పచ్చని పంటలపై చక్కర్లు కొడుతున్నాయి. తక్కువ ఖర్చుతో సమర్థవంతంగా పంటలకు ఎరువులు, పురుగు మందులను పిచికారీ చేయడానికి, విత్తనాలను చల్లడానికి రైతులు వీటిని అద్దెకు తీసుకుంటున్నారు. డ్రోన్‌ల ద్వారా రైతులకు వ్యవసాయ పనులు చేసిపెట్టేందుకు కొన్ని గ్రామాల్లోని యువకులు దీనిని ఒక ఉపాధిగా మార్చుకుంటున్నారు. సంప్రదాయ పద్ధతుల్లో పురుగుల మందు పిచికారీ చేసే పద్ధతులకు.. ఈ డ్రోన్ విధానం సరసమైన, సమర్థవంతమైన, సురక్షితమైన, ఆధునాతన ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతోంది.

కూలీల కొరతతో..

పంట పొలాల్లో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను చల్లడానికి సంప్రదాయ పద్ధతిలో కూలీలను పెట్టుకున్నట్లయితే ఖర్చు తడిసిమోపెడ వుతోంది. ఒక్కో వ్యవసాయ కూలీకి రోజుకు కూలీగా రూ. 500 నుంచి రూ.1000 వరకు చెల్లించాల్సి ఉంటుంది. అయినా కూలీల కొరత వల్ల వారు కూడా కొన్ని సందర్భాల్లో దొరకడం లేదు. దీనికి తోడు రైతులు లేదా కూలీలు పురుగుల మందులు, ఎరువులు చల్లే క్రమంలో వాటి ప్రభావం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారు. రైతులు ఇంతకు ముందు తైవాన్ స్ప్రే మిషన్లను వాడుతున్నారు. వీటి వల్ల హానికరమైన రసాయనాల వల్ల దీర్ఘకాలిక చర్మ, శ్వాసకోశ సంబంధ వ్యాధుల బారిన పడుతున్నారు. పైగా యంత్రానికి రూ.1000, అదనపు బ్యాటరీకి రూ.4వేలు పెట్రోల్‌కు రూ.8వేల చొప్పున వెచ్చించాల్సి వస్తోంది. ఇది రైతులపై అధిక ఆర్థిక భారాన్ని మోపుతోంది. దీంతో పిచికారీ ప్రక్రియ అనేది ఖరీదైందిగా, ప్రమాదకరమైదిగా మారిపోయింది. అదే మందుల పిచికారీకి లేదా పొలాల్లో ఇతర సస్యరక్షణ చర్యలకు డ్రోన్ సేవలను వినియోగించుకున్నట్లయితే ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. ఒకరానికి సగటున రూ.600 వరకే ఖర్చవుతోంది.

ఉపాధి

డ్రోన్‌సేవలను వినియోగించుకోవడానికి రైతులు ముందుకు వస్తుండడంతో గ్రామాల్లోని యువ రైతులు వాటిని కొనుగోలు చేసి తమ అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు ఇతర రైతులకు అద్దెకు ఇవ్వడం ద్వారా అదనపు ఉపాధిని పొందుతున్నారు. సాధారణంగా ఒక డ్రోన్ పేలోడ్‌ను బట్టి ధర రూ.5లక్షల నుంచి రూ.12లక్షల వరకు ఉంటుంది. ఉదాహరణకు కేవలం పురుగు మందులను చల్లడానికి మాత్రమే అయితే దానికి అమర్చే పేలోడ్‌ను బట్టి ధర రూ.5లక్షల వరకు ఉంటుంది. అలా కాకుండా డ్రోన్ ద్వారా బహుముఖ సేవలను పొందాలనుకుంటే అందుకు అవసరమైన పేలోడ్‌లను అదనంగా జతచేసుకుంటూ వెళితే వాటి ధర క్రమంగా పెరుగుతూ ఉంటుంది. ఐదు నుంచి పది ఎకరాలు ఆపైన పొలం ఉన్న మధ్య, సంపన్న రైతులు సంప్రదాయ పిచికారీకి అయ్యే ఖర్చును తగ్గించుకునేందుకు ఏకంగా డ్రోన్లనే కొనుగోలు చేస్తున్నారు. పంట సీజన్లో వారు తమ పొలాల కోసం ఈ డ్రోన్లను వినియోగించుకోవడంతో పాటు ఇతర రైతులకు అద్దెకు ఇస్తున్నారు. డ్రోన్ యజమానులే అవసరమైన ఇతర రైతుల పొలాల్లో పిచికారీ చేయడం లాంటి సేవలను డ్రోన్లతో అందించి ఎకరానికి రూ.500 చొప్పున చార్జీ తీసుకుంటున్నారు. ఇది పేద, మధ్య తరగతి రైతులకు కూడా ఎంతో లాభదాయకంగా ఉంటోంది. దీనితో ఇప్పుడిప్పుడే చాలా మంది రైతులు అద్దె ప్రాతిపదికపై వాడుకునేందుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 15పైగా డ్రోన్లు అమ్మకమయ్యాయి. మరో 5 డ్రోన్లను రైతులకు సర్వీస్ కోసం అందుబాటులో ఉంచారు. డ్రోన్లను కొనుగోలు చేసిన రైతులు వారు వాడుకోవడంతో పాటు ఇతర రైతులకు అద్దెకు ఇస్తున్నారు. దీని ద్వారా పంట సీజన్‌లో రోజుకు రూ. 1000 నుంచి రూ. 2000 వరకు ఆదాయం పొందుతున్నారు. పంట సీజన్‌లో డిమాండ్‌ను బట్టి ఇంతక్నా ఎక్కువే ఆర్జిస్తున్నారు. డ్రోన్లు కొనుగోలు చేయాలని ఆసక్తి ఉన్న వారు హైదరాబాద్‌కు చెందిన అకాడమీ వారిని 9052999365 ఫోన్ నెంబర్లో సంప్రదించవచ్చు. వారే శిక్షణకూడా ఇస్తారు.



పిచికారీకి డ్రోన్ సిద్ధం చేస్తున్న ఆపరేటర్

రైతుల నుండి డిమాండ్ పెరుగుతోంది

బీటెక్ పట్టభద్రుడైన నేను ఓ బ్యాంక్‌లో సేల్స్ మేనేజర్‌గా పని చేస్తూనే డ్రోన్‌ను అద్దెకు నడుపుతున్నా. హైదరాబాద్‌లోని ఎన్‌ఐపీహెచ్‌ఎం-మారుత్ అకాడెమీలో డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ తీసుకున్నా. మారుత్ ఏజీ 365 డ్రోన్ ద్వారా మా ఆరెకరాల్లోని పంటలకు పిచికారీ చేయడంతో పొరుగు రైతులకు కూడా అద్దె విధానంలో డ్రోన్ సేవలను అందిస్తున్నా. ఇలా రెండు నెలలుగా సుమారు 100ఎకరాలకుపైగా పొలాలకు పిచికారీ చేసి.. రెండు నెలల్లో రూ.లక్ష సంపాదించా. రైతుల స్పందన వస్తోంది. రోజుకు 10 నుంచి 15 ఎకరాలు పిచికారీ కోసం ఆర్డర్లు రావడం మొదలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మద్దతు ఉంటే వరంగల్‌లోని రైతులకు డ్రోన్ సేవలను మరింత విస్తృతంగా అందించగలుగుతా.

\- అన్వేష్, డ్రోన్ యజమాని, యువరైతు, ఊరుగొండ, ఆత్మకూరు



కాకతీయుల వారసుడు పెళ్లికొడుకాయెనే..

- ఖజురహోలో అంగరంగవైభవంగా కమల్‌చంద్ర వివాహం
- 2022లో మొదటి సారి ఓరుగల్లుకు వచ్చిన బంజ్ దేవ్
- 700 ఏళ్ల తర్వాత కాకతీయ గడ్డపై కాలిడిన వారసుడీయన..



అంబారిపై కమల్ చంద్ర బంజ్ దేవ్

హనుమకొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కాకతీయుల రాజవంశంలో 22వ వారసుడైన కమల్ చంద్ర భంజ్ దేవ్ వివాహం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. బస్తర్ మహరాజు అయిన బంజ్ దేవ్.. నాగోడ్ యువరాణి భువనేశ్వరిని వివాహమాడారు. ఖజురహోలో జరిగిన ఈ వేడుకకు దేశంలోని వివిధ రాజ్యాల ప్రముఖులు హాజరయ్యారు. వివాహ వేడుకల్లో భాగంగా మాతా దంతేశ్వరి అమ్మవారికి ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర మహిళా పోలీసు దళం తుపాకీ పేల్చి గౌరవ వందనం సమర్పించింది. వివాహం కోసం ప్రత్యేకంగా మూడు విమానాలు, రెండు హెలీకాప్టర్లు ఏర్పాటు చేశారు. ఏనుగు అంబారీ, ఒంటెల ప్రదర్శన గిరిజనుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వారం రోజులుగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పేరొందిన కళాకారులు తమ ప్రదర్శనలు ఇచ్చారు. శనివారం వరంగల్‌కు చెందిన గజ్జెల రంజిత్ బృందం ఆధ్వర్యంలో పేరిణి నృత్యప్రదర్శన జరగనుండగా.. వరంగల్‌కు చెందిన చరిత్రకారుడు, టార్చ్ సంస్థ కార్యదర్శి అరవింద్ ఆర్యా ఈ వివాహవేడుకల్లో పాల్గొంటున్నారు.

2022లో వరంగల్ వచ్చిన వారసుడు

కాకతీయుల వారసుడు కమల్ చంద్ర బంజ్ దేవ్ 2022 జూలై 7న మొదటి సారి ఓరుగల్లుకు విచ్చేశారు. కాకతీయ వైభవ సప్తాహం ఉత్సవాల్లో పాల్గొనేందుకు ముఖ్యఅతిథిగా బంజ్ దేవ్ రాగా.. 700 ఏళ్ల తర్వాత కాకతీయుల రాజవంశం నుంచి 22వ తరం వారసుడిగా తమ పూర్వీకులు ఏలిన ఓరుగల్లు గడ్డపై ఆయన అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఆయనకు ఓరుగల్లు వాసులు ఘనంగా స్వాగతం పలికారు. వరంగల్ పర్యటనలో భాగంగా ఆయన భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బస్తర్‌లోని తమ ఇలవేల్పు దంతేశ్వరికాగా వరంగల్‌లో కాకతీయుల కొంగుబంగారం భద్రకాళి అమ్మవారని, ఇద్దరూ ఒక్కటేనని నాడు కమల్ చంద్ర బంజ్ దేవ్ వ్యాఖ్యానించడం గమనార్హం.



పెళ్లి కుమారుడుగా కాకతీయుల వారసుడు కమల్ చంద్ర బంజ్ దేవ్

ఓరుగల్లుపై రక్తపు మరకలు

- కత్తులు, రాడ్లతో దుండగుల స్వైరవిహారం
- కుటుంబ తగాదాలు, ఆస్తి, వివాహేతర, భూ సమస్యలతో ఘటనలు
- నిలువరించడంలో పోలీసుశాఖ ఉదాసీనత

ఇటీవల పెరుగుతున్న ప్రతీకార దాడులు





వెంకన్న

జనగామలో వెంకన్న హత్య కేసులో నిందితుల అరెస్టు (ఫైల్)

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మానవత్వం మరచిన వ్యక్తులు కత్తులతో దాడులకు తెగబడుతున్నారు. కర్కషంగా వ్యవహరిస్తూ హత్యాయత్నాలకు పాల్పడుతున్నారు. ఇటీవల జరుగుతున్న ఇలాంటి ఘటనలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో కలకలం రేపుతున్నాయి. ఎలాంటి వణుకు, బెణుకు లేకుండా పగలు, ప్రతీకారాల మాటున నడిరోడ్డుపై కిరాతకంగా కత్తులతో పొడిచి, ఇనుప రాడ్లు, బండ రాళ్లతో తలలపై కొట్టి వ్యక్తులను అంతమొందించి రాక్షస చర్యలకు పాల్పడుతున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో గురువారం ఒక్క రోజే మూడుచోట్ల హత్యాయత్నాలు జరగడం ప్రజలను కలవరపెడుతోంది. విచ్చలవిడిగా అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు, గంజాయి విక్రయాలు జరుగుతుండటంతో పూటుగా తాగి మద్యం మైకంలో పగలు, ప్రతీకారాల పేరిట చెలరేగిపోతున్నారు. పోలీసుశాఖ నిర్లక్ష్యం వీడి, ఇలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరించకపోతే రోజుకో హత్య, హత్యాయత్నం, లైంగికదాడులను చూడాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వరుస ఘటనలతో బెంబేలు

హత్యలు, హత్యాయత్నాలతో ఉమ్మడి వరంగల్ అట్టుడికిపోతోంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని వెస్ట్‌జోన్(జనగామ)లో జనవరి 11న రైల్వేస్టేషన్‌లో కోతులు ఆడిస్తూ జీవనం వెళ్లదీసే మహబూబాబాద్ జిల్లాకు చెందిన బానోతు వెంకన్నను ప్రతీకారం పేరిట గాండ్ల సంపత్ అనే వ్యక్తి మరో ఇద్దరితో కలిసి కత్తులతో పొడిచి, బండ రాయితో మోదీ శవాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టడం కలకలం రేపింది. అలాగే ఓ మహిళ విషయంలో ఇద్దరు ఆటోడ్రైవర్ల మధ్య ఏర్పడ్డ వివాదం కారణంగా జనవరి 22న సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అదాలత్ జంక్షన్‌లో సమీపంలో పట్టపగలే ఆటోడ్రైవర్ మాచర్ల రాజ్‌కుమార్‌ను అందరూ చూస్తుండగానే మరో ఆటో డ్రైవర్ వెంకటేశ్వర్లు విచక్షణారహితంగా కత్తితో శరీర భాగాలను ఛిద్రం చేసి హత్య చేయడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈనెల 19న భూపాలపల్లి జిల్లాలో సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తిని గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడిచేసి హత్య చేశారు. తాజాగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని సెంట్రల్ జోన్ పరిధిలో గురువారం ఒక్కరోజే మూడు సంఘటనలు చోటు చేసుకోవడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలో ఉన్నారు. మట్టెవాడ పీఎస్ పరిధిలోని వాసవి కాలనీలో కోట చంద్రశేఖర్ అనే వ్యక్తి భార్యతో పాటు అత్త, మామను కత్తితో దాడిచేసి హత్యాయత్నం చేయగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే కారులో కాజీపేట నుంచి భట్టుపల్లి మీదుగా ఉర్సు గుట్టకు వెళుతున్న యువ వైద్యుడు గాదె సుమంత్‌రెడ్డిని అమ్మవారిపేట క్రాస్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలైన వైద్యుడు ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చేరాడు. ఇదిలా వుండగా, హసన్‌పర్తి మండలంలోని మడిపల్లిలో రెండు కుటుంబాల మధ్య ఏర్పడిన అంతర్గత కలహాలు కారణంగా నలుగురు వ్యక్తులపై కత్తులు, రోకలిబండతో దాడిచేయగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

జోరుగా మద్యం, గంజాయి విక్రయాలు

హత్యలు, హత్యాయత్నాలు మద్యం, గంజాయి మత్తులో జరిగినట్లుగానే పోలీసుల విచారణలో తేలింది. బస్టాండ్, రైల్వేస్టేషన్‌ల పరిధిలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లల్లో తెల్లవారుజాము వరకు మద్యం, గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులను మచ్చిక చేసుకుని విచ్చలవిడిగా విక్రయిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా హనుమకొండ బస్టాండ్, వరంగల్ బస్టాండ్, కాజీపేట రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో మద్యం, గంజాయి విచ్చలవిడిగా విక్రయాలు చేస్తున్నారని తెలుస్తోంది. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపైకి దాడులు చేసేందుకు ప్రత్యేక బృందాలు కూడా మద్యం, గంజాయి దందా చేసే వ్యక్తులు నియమించుకున్నారని తెలుస్తోంది.

కొరవడిన ముందస్తు సమాచారం

పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏమి జరుగుతుందనే దానిపై ముందస్తు సమాచారాన్ని సేకరించడంలో పోలీసులు వైఫల్యం చెందినట్లుగా తెలుస్తోంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా నేరం జరిగిన తర్వాత పోలీసులు ఆగమేఘాలమీద స్పందిస్తున్నారు తప్పా.. దానికి కంటే ముందు నేరం జరగకుండా అరికట్టాల్సిన అంశాలపై దృష్టిసారించడం లేదనే అపవాదు పోలీసులపై ఉంది. ఆయా ఠాణాల పరిధిలో ఏమేమి దందాలు జరుగుతున్నాయి..? ప్రజలకు ఎవరితో ప్రమాదం ఉంది..? అధికారులు నేరస్థులతో ఏ విధంగా వ్యవహరిస్తున్నారు..? అనే దానిపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి ఉన్నతాధికారులు దృష్టికి తీసుకపోవాల్సిన ఫీల్డ్ ఆఫీసర్లు సైతం సమాచారం కోసం పక్కవారిపై ఆధారపడి వారి ఇచ్చిన సమాచారాన్నే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి సమస్య తీవ్రతను తగ్గిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తోన్నాయి.

సరిహద్దుల పేరిట విధుల్లో నిర్లక్ష్యం

కమిషనరేట్ పరిధిలోని ఠాణాల మధ్య గెట్ల పంచాయితీలు బాధితులకు శాపంగా మారాయి. హత్యలు, రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు మా ఠాణా పరిధి కాదంటే.. మా ఠాణా పరిధి కాదని.. అసలు విషయాన్ని పక్కకు పెట్టి పంచాయితీని ముందేసుకొని సమస్యలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు పోలీసు అధికారులపై వస్తున్నాయి. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏదో ఒక చోట సరిహద్దు తగాదా ఉంటోందని బాధితులతో పాటు పోలీసుశాఖలోని కొంత మంది సీనియర్ అధికారులు అంటున్నారు. తాజాగా భట్టుపల్లిలో జరిగిన హత్యాయత్నంలో సైతం ఇద్దరి సీఐల మధ్య ఇదే వాదన జరిగినట్లుగా సమాచారం. కేసు నమోదు చేయడం, దర్యాప్తు, కోర్టులో సాక్ష్యాలను ప్రవేశపెట్టడంలాంటి లొల్లి మాకెందుకని, మా పరిధిలోకి రాదంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలుస్తోంది. ఎవరి పరిధిలోకి వచ్చినా ప్రమాదం తెలిసినప్పుడు, సంఘటన స్థలాన్ని అధికారి సందర్శించినప్పుడు తప్పించుకోకుండా జీరో ఎఫ్‌ఐఆర్ చేసి తర్వాత కేసును సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసే వీలుందని కొంత మంది అధికారులు పేర్కొంటున్నారు. గురువారం భట్టుపల్లిలో జరిగిన సంఘటనలో సమీపంలో ఉన్న బెల్టుషాపు నిర్వాహకుడు ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తీసుకొస్తున్నాడో తెలుసుకొని అదే పోలీస్‌స్టేషన్ పరిధిలోకి హత్యాయత్నం జరిగిన ఏరియా వస్తోందని నిర్ధారించుకొని కేసు నమోదు చేశారని విశ్వసనీయ సమాచారం. పనిచేసే పోలీస్‌స్టేషన్ పరిధిలో హద్దులు కూడా తెలియకుండా పోలీసులు విధులు నిర్వహించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తోన్నారు.

ప్రారంభోత్సవ కార్యక్రమానికి..

భారతీయ నాటక కళ సమితి ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి 51వ ఆహ్వాన నాటిక పోటీల ప్రారంభోత్స కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా స్థానిక వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ముఖ్య అతిథిగా వరంగల్ ఎంపీ కడియం కావ్య, విశిష్ట అతిథులుగా తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ అధ్యక్షుడు మార్నేని రవీందర్‌రావు, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ఆత్మీయ అతిథులుగా కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం, న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు చోల్లేటి రామకృష్ణ హాజరు కానున్నారు.



భారతీయ నాటక కళా సమితి ఆహ్వాన పత్రికతో నిర్వాహకులు

ఇంతింతై.. కళలకు సొంతమై..

- వర్ధన్నపేటలో ఉభయ రాష్ట్రస్థాయి నాటికల పోటీలు
- నేటి నుంచి ఐదురోజుల పాటు నిర్వహణ
- తరలిరానున్న రాష్ట్రస్థాయి కళాకారులు

ఇంతింతై.. కళలకు సొంతంగా మారుతోంది వర్ధన్నపేట. 51 ఏండ్ల కిందట 8మందితో నాటికలకు బీజం పడగా.. నేడు అది మహావృక్షంలా ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా విలసిల్లుతోంది. వర్ధన్నపేట పట్టణంలో శివరాత్రి సందర్భంగా ఐదు రోజుల పాటు భారతీయ నాటికలు ప్రదర్శించనున్నారు. వివిధ రాష్ట్రాల కళాకారులతో ఏటా భారతీయ నాటక కళా సమితి రాష్ట్రస్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తోంది. కళలకు వేదికగా వర్ధన్నపేట భారతీయ నాటక కళా సమితి నిలవగా, అర్ధ శతాబ్దం దాటడంతో కళా సమితి సభ్యులకు ఆనందాన్ని తెస్తోంది.

వర్ధన్నపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పండుగను పురస్కరించుకుని ఐదు రోజుల పాటు వర్ధన్నపేట పట్టణంలోనాటకోత్సవాలు ప్రజలకు ఎంతో అలరించనున్నాయి. ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు నాటక పోటీల షెడ్యూల్‌ను ప్రకటించగా, ఐదు రోజులు పూర్తి నాటికలు వేసి, శివరాత్రిన ఇతర కార్యక్రమాలు, బహుమతుల ప్రదానం చేస్తారు. 22న మొదటి ప్రదర్శన విశ్వశాంతి కల్చరల్ అసోసియేన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో స్వేచ్ఛ, రెండో ప్రదర్శన డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగులు, తెనాలి వారి ఆధ్వర్యంలో ది లెస్సన్, 23న కళాంజలి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో వీడేం మగవాడండీ బాబు, రెండో ప్రదర్శనగా ది అమెచ్యూర్ డ్రమటిక్ అసోసియేషన్ చిలుకలూరిపేట వారి ఆధ్వర్యంలో వర్క్ ఫ్రమ్ హోమ్, 24న ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి ఆధ్వర్యంలో కిడ్నాప్, రెండో ప్రదర్శనగా మైత్రి కళానిలయం విజయవాడ వారి ఆధ్వర్యంలో బ్రహ్మ స్వరూపం, 25న శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారి ఆధ్వర్యంలో జనరల్ బోగీలు, రెండవ ప్రదర్శనగా కళానికేతన్, వీరన్నపాలెం వారి ఆధ్వర్యంలో ఋతువులేని కాలం, 26న శివరాత్రి పండుగ సందర్భంగా పలు కల్చరర్ ప్రోగ్రామ్స్, విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తారు.



భారతీయ నాటక కళ సమితి ఆడిటోరియం

నాలుగు దశాబ్దాలుగా..

1974లో వర్ధన్నపేట మండలం ఇల్లందలో ఈగ శ్రీహరి, వడ్లకొండ వెంకటయ్య, వేముల ఆంజనేయులు, మల్లూరి రంగయ్య, పోశాల సూర్య నారాయణ, సిరివోలు వెంకట్రామరావు, వనం లక్ష్మీకాంతరావు, వడ్లకొండ ఎల్లగౌడ్ తదితరులు భారతీయ నాటక కళాసమితికి బీజం వేశారు. 1980లో వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద నుంచి ఆనాటి తాలుకా కేంద్రమైన వర్ధన్నపేటకు వేదిక మారింది. అప్పట్లో నిర్దిష్టమైన స్థలం, ప్రత్యేక వేదికంటూ లేకపోవడంతో నాటిక పోటీలకు తీవ్ర అవరోధాలు ఏర్పడేవి. దీంతో వడ్లకొండ ఎల్లగౌడ్ దర్శకత్వంలో స్థానిక కళాకారులతో అల్లూరి సీతారామరాజు నాటికను ప్రదర్శించి దాతల ద్వారా విరాళాలు సేకరించారు. అలా అల్లూరి సీతారామరాజు నాటక ప్రదర్శన ద్వారా సేకరించిన డబ్బుతో స్థల సేకరణ చేసి భారతీయ నాటక కళ సమితి శాశ్వత భవనం, నాటికల ప్రదర్శన కోసం ప్రత్యేకంగా వేదికను ఏర్పాటు చేశారు.

కలగానే జాతీయ స్థాయి పోటీలు

గతంలో నాటిక కళా సమితి కమిటీ సభ్యులు ఎంతో కృషి చేసి నాటకాలను రాష్ట్రస్థాయికి చేరేలా కృషిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కళాకారులతో పాటు తమిళనాడుకు చెందిన కళాకారులను తీసుకువచ్చి నాటికలు ప్రదర్శింపచేశారు. సినీ రంగంలో మంచి స్థానాల్లో ఉన్న క్యారెక్టర్ ఆర్టిస్టులను సైతం తీసుకువచ్చారు. కానీ, ప్రస్తుతం హైదరాబాద్ నుంచి మాత్రమే ఎక్కువ శాతం నాటికలు ప్రదర్శించే వారు వస్తున్నారు. దీంతో భారతీయ నాటిక పోటీలు ఇంకా రాష్ట్రస్థాయిలో ఉండిపోయాయి. ఇక జాతీయ స్థాయిలో పోటీలు కళగానే మిగిలిపోయే అవకాశాలు ఉన్నాయా? అంటూ ప్రేక్షకులు చర్చించుకుంటున్నారు. గతంలో విమర్శలు రావడంతో ఇప్పటి ఆహ్వాన పత్రికలో ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి పోటీలని ముద్రించి చేతులు దులుపుకున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సైతం కళా సమితి ముందుకు వెళ్తే ఆదరణ బాగుంటుందని సూచిస్తున్నారు.

'కాష్' అవార్డుకు ఎంపికైన రేవంత్

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ములుగు పట్టణానికి చెందిన కొత్త రేవంత్ హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ కాష్ అవార్డుకు ఎంపికయ్యారు. గురువారం హైదరాబాద్‌లో 84వ ఆలిండియా ఆర్ట్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని నిర్వహించగా కొత్త రేవంత్ పాల్గొని తాను గీసిన చిత్రం హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ కాష్ అవార్డుకు ఎంపికై తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఆర్ట్ సొసైటీ ప్రెసిడెంట్ ఎంఎస్.రమణారెడ్డి, సభ్యుల చేతుల మీదుగా సర్టిఫికెట్, నగదు బహుమతి అందుకున్నారు.

చెక్‌పోస్టును తనిఖీ చేసిన డీఎస్పీ

ములుగు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని మల్లంపల్లిలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును శుక్రవారం డీఎస్పీ నలువాల రవీందర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హనుమకొండ వైపు వెళ్తున్న ఇసుక లారీలను తనిఖీ చేసి డ్రైవర్లకు సూచనలు చేశారు. ఇసుక అక్రమ రవాణాకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీస్ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎస్సై వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది ఉన్నారు.

జాకారం గురుకులంలో టీజీసెట్ పరీక్ష కేంద్రం ఏర్పాటు

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ములుగు మండలంలోని జాకారం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో టీజీసెట్ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీన 5, 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు ప్రవేశ పరీక్ష జరుగనుండగా 546 మంది విద్యార్థులు హాజరు కానున్నారని అన్నారు. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు ఉదయం 9గంటల వరకే చేరుకోవాలని, విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్‌తో పాటు బ్లాక్, బ్లూ బాల్ పెన్, ప్యాడ్, వాటర్ బాటిల్, ఆధార్‌కార్డు తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

323 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుకున్న బియ్యం లారీతో ఎస్సై కమలాకర్, సిబ్బంది

గోవిందరావుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 323.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పస్రా ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన ప్రకారం... మండలంలోని మొద్దులగూడెం గ్రామ సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గుండాల నుంచి 668 బస్తాల లోడుతో వస్తున్న లారీ అనుమానాస్పదంగా కనిపించడంతో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించామని అన్నారు. దీంతో డ్రైవర్ పీడీఎస్ బియ్యమని ఒప్పుకున్నట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం లచ్చగూడానికి చెందిన బత్తుల రాజు పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఎక్కువ ధరకు విక్రయించేందుకు తరలిస్తున్నాడని చెప్పారు. పట్టుకున్న పీడీఎస్ బియ్యం విలువ సుమారు రూ.6లక్షల 47వేలు ఉంటుందని అన్నారు. దీంతో లారీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ఇసుక క్వారీల తనిఖీ

మంగపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపేట, కత్తిగూడెం గోదావరిలో గల ఇసుక క్వారీలను రెవెన్యూ, పోలీస్, టీఎస్ఎండీసీ శాఖల అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. వేబిల్లులను పరిశీలించి, అధిక ఇసుకలోడ్ జరుగుతున్నదా? లేదా? పరిశీలించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు ఇసుక రేజ్లింగ్ కాంట్రాక్టర్లను హెచ్చరించారు. ఈ తనిఖీలలో టీఎస్ఎండీసీ పీవో శ్రీకాంత్, ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, స్థానిక తహసీల్దార్ తోట రవీందర్, ఎస్సై టీవీఆర్ సూరి, ఆర్ఐ శ్రీనివాస్, ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

రాజలింగమూర్తి హత్యతో బీఆర్ఎస్‌కు సంబంధం లేదు : సట్ల రవి

టేకుమట్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లిలో బుధవారం రాత్రి జరిగిన సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్యతో బీఆర్ఎస్ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రాజలింగమూర్తి హత్య విషయంలో చేసిన అనుచిత వ్యాఖ్యలను బీఆర్ఎస్ మండల కమిటీ పక్షాన ఖండిస్తున్నామన్నారు. ఏం జరిగిందనేది పోలీసులు చెబితే గానీ నిజానిజాలు తెలియవని, ఏమి తెలియకుండానే కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు. రాజలింగమూర్తి హత్యను రాజకీయంగా వాడుకునేందుకు అధికార పార్టీ ప్రయత్నిస్తుందన్నారు. లింగమూర్తి హత్యకు భూ వివాదాలే కారణమని, పోలీసులు, స్థానికులు చెపుతుంటే కాంగ్రెస్ నాయకులు మాత్రం కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిలపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, బొడ్డు సదానందం, బండెల నరేష్, పింగిలి వెంకటేశ్వర్‌రెడ్డి, ఉద్దమారి మహేష్, నల్లబెల్లి రవీందర్, మారం లింగారెడ్డి, గువ్వాడి లక్ష్మణ్, ప్రభాకర్‌రావు, ఇండ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

మంగపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ, బీజేవైఎం మండల కమిటీల ఆధ్వర్యంలో వేర్వేరుగా ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. శుక్రవారం మండలంలోని నర్సింహసాగార్, పూరేడుపల్లి, గాంధీనగర్, నరేంద్రావుపేట, శనిగకుంట, మల్లూరుమొట్లగూడెం, మల్లూరు, కొత్తమల్లూరు, తిమ్మంపేట, అబ్బాయిగూడెంలలో గల ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులను కలిసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాలలో బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు రావుల జానకిరావు, నిడుదవోలు శ్రీనివాస్, బీజేపీ జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు రామిడి సురేష్ పటేల్, బొల్లికొండ సాంబయ్య, బీజేపీ, బీజేవైఎం నాయకులు ఎర్రావుల నర్సమ్మ, మూతి రవి, ఇస్లావత్ శివకుమార్, మినుగు తిరుపతి, ఈర్ల మధు, ఎంబటి నవీన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మైసమ్మ గుడిని ఢీకొన్న ట్రాలీ వాహనం

- ఇద్దరికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్‌లో గల మైసమ్మ గుడిని టాటా ట్రాలీ వాహనం శుక్రవారం ఢీకొంది. ఈ ఘటనలో వాహనంలోని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన యాకుబ్, నర్సంపేట జిల్లా కేంద్రానికి చెందిన గోపి అనే ఇద్దరు వ్యక్తులు భూపాలపల్లిలోని వస్త్ర దుకాణానికి నూతన దుస్తుల స్టాక్‌ను టాటాఏస్ ట్రాలీ వాహనంలో తీసుకొస్తున్నారు. ఈక్రమంలో మార్గమధ్యలో మంజూర్‌నగర్‌లో సమీపంలో రోడ్డు మధ్యన ఉన్న మైసమ్మగుడిని గమనించకుండా అతివేగంతో వెళ్లి ఢీకొట్టారు. దీంతో వాహనం కుడివైపున పూర్తిగా ధ్వంసమైంది. వాహనంలో ఉన్న యాకుబ్, గోపి కిందపడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. కాగా, ఇదే సమయంలో అటుగా వెళ్తున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తన వాహనాన్ని ఆపి ప్రమాద పరిస్థితిని అక్కడున్న వారిని అడిగి తెలుసుకున్నారు. ఆ వెంటనే 108కు సమాచారం అందింపజేసి క్షతగాత్రులను దగ్గరుండి ఆస్పత్రికి పంపించారు. అయితే, అతివేగం మూలంగానే ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు చర్చించుకున్నారు. మరోవైపు విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలిని పరిశీలించారు.

సీసీఐ కేంద్రాలు పునఃప్రారంభం

- మిల్లుల వద్ద వాహనాల బారులు
- జిల్లాలో సీసీఐ కేంద్రాల ద్వారా 3.59 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు


కాటారంలోని మీనాక్షి మిల్లు వద్ద బారులుదీరిన పత్తి వాహనాలు

కాటారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టించి పండించిన పత్తి విక్రయాల కోసం ఎదురు చూపులు చూసిన రైతులకు ఊరట కలిగింది. 20 రోజులక్రితం కేంద్రాల్లో జిన్నింగ్‌కాని పత్తి నిల్వలు భారీగా ఉన్నాయనే కారణంతో సీసీఐ కేంద్రాలను మూసేయడంతో ఇబ్బందులు పడ్డ రైతులకు సీసీఐ కేంద్రాలు శుక్రవారం పునఃప్రారంభం కావడంతో పత్తి విక్రయాల కోసం పరుగులు పెడుతున్నారు. కుటుంబం, యాసంగి సీజన్ అవసరాల కోసం డబ్బులు కావాల్సి ఉండగా తక్కువ ధరలకు దళారులకు అమ్మడానికి మనస్సు ఒప్పక సీసీఐ కేంద్రాలు పునఃప్రారంభమెప్పుడవుతాయని మూడు వారాలుగా వేచిచూసిన రైతులు కేంద్రాలు ప్రారంభమయ్యాయని తెలిసి పత్తి వాహనాలు మిల్లులకు బారులు తీరాయి. సీసీఐ కేంద్రాలు మళ్లీ ఎప్పుడు మూత పడతాయోనని పత్తి విక్రయాల కోసం రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. కాటారం మండలంలో రెండు జిన్నింగ్ మిల్లుల ఆవరణలో సీసీఐ కేంద్రాలుండగా జిల్లా వ్యాప్తంగా ఐదు జిన్నింగ్ మిల్లుల వద్ద సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టారు. 2024 నవంబరు 7వ తేదీ నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకు పత్తి కొనుగోళ్లు జరిగాయి.

సీసీఐ కేంద్రాల వద్ద పత్తి నిల్వలు పెరిగిపోవడంతో తాత్కాలికంగా కొనుగోళ్లు నిలిపేస్తున్నట్లు 20 రోజుల క్రితం ప్రకటించిన అధికారులు తిరిగి సీసీఐ కేంద్రాలను శుక్రవారం ప్రారంభించి కొనుగోళ్లు చేపడుతున్నారు. మండలంలోని పత్తి మిల్లు వద్ద సీసీఐ కేంద్రం పునఃప్రారంభమవుతుందని గుమ్మళ్లపల్లికి చెందిన పలువురు రైతులు ట్రాక్టర్లలో పత్తి లోడ్ చేసుకుని వచ్చి ట్రాలీలను మిల్లు వద్దనే వదిలేసి వారం గడవగా వారంతా కేంద్రాల పునఃప్రారంభంతో మిల్లుకు తరలి వచ్చారు.. కాగా కాటారం మండలంలోని మీనాక్షి, రుద్ర జిన్నింగ్ మిల్లుల వద్ద ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1,28,327 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు.

జిల్లా వ్యాప్తంగా సుమారు 3.59 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు ఇన్‌చార్జ్ డీఎంవో కనకశేఖర్ వెల్లడించారు. చిట్యాల మండలంలోని రెండు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కేంద్రాల ద్వారా 2.06 లక్షల క్వింటాళ్లు, భూపాలపల్లిలో సుమారు 25వేల క్వింటాళ్ల పత్తి సీసీఐ కేంద్రంలో కొనుగోలు చేశారన్నారు. వేలాది క్వింటాళ్ల పత్తి ఇంకా రైతుల వద్దనే ఉండటంతో సీసీఐ కేంద్రాలను పత్తి మొత్తం విక్రయించే వరకు నడపాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

టీయూఎఫ్ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం

వెంకటాపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టీయూఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంటి భద్రయ్య ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం మండల కేంద్రంలోని పోస్టాఫీసు వద్ద పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా భద్రయ్య మాట్లాడుతూ ఉద్యమకారులు చేసిన పోరాటాలు, త్యాగాల వల్లనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయిందని, అలాంటి ఉద్యమకారులను గత ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిరక్ష్యం వహిస్తుందన్నారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం, గుర్తింపు కార్డులు, ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటుచేసి వారి ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు. టీయూఎఫ్ నాయకులు దగ్గు ప్రభాకర్‌రావు, అబ్బ గోపాల్‌రెడ్డి, ఎమ్డీ.రహీమొద్దీన్, గాజుల శ్రీనివాస్, నర్ర భద్రయ్య, శెట్టి శ్రీధర్, రెడ్డి పరశురాములు, జర్పుల రమేష్ పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్ సమీక్ష

కాకతీయఖని, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియా అధికారులతో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలపై అధికారులతో చర్చించారు. అందరు కలిసికట్టుగా పనిచేసి యాజమాన్యం నిర్ధేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సూచించారు. గనుల్లో ఎలాంటి సమస్యలు ఉన్నాయని సంబంధిత అధికారులనుఅడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-3ని సందర్శించారు. ఏరియా సింగరేణి జీఎం కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఎస్‌వోటూ జీఎం కవీంద్ర, ఓసీ-2 ప్రాజెక్ట్ అధికారి వెంకట్రామిరెడ్డి, వన్ గ్రూప్ ఏజెంట్ వెంకటరమణ, అధికారులు రామకృష్ణారెడ్డి, రవికుమార్, భిక్షమయ్య, మారుతి తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ సూర్యనారాయణ

ఎన్నికల్లో పొరపాట్లకు తావివ్వొద్దు

(5వ పేజీ తరువాయి)

అంతా కేటాయించబడిందా.. లేదా అన్నది జాగ్రత్తగా సరిచూసుకోవాలని అన్నారు. పోలింగ్ సామగ్రిని పరిశీలించుకున్న పిదప తమ బృందంతో కలిసి అధికార యంత్రాంగం సమకూర్చిన వాహనంలోనే నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ ఎంతో జాగ్రత్తగా పోలింగ్ ప్రక్రియను జరిపించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ చిన్న తప్పిదానికి కూడా తావులేకుండా ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. నిర్లక్ష్యానికి తావిస్తూ, తప్పిదాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టంచేశారు. ఎట్టిపరిస్థితుల్లో బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను పీవోలు తమ పర్యవేక్షణలో తమ వెంటే ఉంచాలని జాగ్రత్తలు సూచించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమావళి ప్రకారం పొరపాట్లకు తావులేకుండా పక్కాగా విధులు నిర్వర్తించాలని, ఓటర్లు, అభ్యర్థుల ఏజెంట్లు వివిధ అంశాలపై సందేహాలను లేవనెత్తే అవకాశాలు ఉన్నందున వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత పీవోలదేనని అన్నారు. పోలింగ్ పూర్తయిన అనంతరం పక్కాగా రికార్డు బుక్కులలో వివరాలను పొందుపరుస్తూ నివేదిక తయారు చేయాలని సూచించారు. ఎలాంటి సందేహాలున్నా శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ వివరించారు. అనంతరం పోలింగ్ డే సందర్భంగా పీవోలు, ఏపీవోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి మాస్టర్ హమీద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్, ములుగు తహసీల్దార్ విజయభాస్కర్, పర్యవేక్షకులు సలీం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో వాలీబాల్ మెగా టోర్నీ

కాటారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లిలో ఈనెల 24, 25వ తేదీల్లో యూత్ ఆధ్వర్యంలో కాటారం, మల్హర్ మండలాల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు స్వామి, అశోక్, రాజు, రణధీర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాల్నేని రామకృష్ణ, సంతోష్ స్మారకార్థం నిర్వహించే టోర్నీలో రెండు మండలాల పరిధిలోని క్రీడాకారులు ఆయా జీపీల పరిధి జట్లలోనే ఆడాలన్నారు. టోర్నీ విజేత జట్టుకు రూ.5,016, రన్నరప్ జట్టుకు రూ.3,016 నగదు బహుమతితో పాటు ట్రోఫీలు అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు 9866695499, 8464911914, 6305222450 నెంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

శివ కల్యాణ మహోత్సవానికి కలెక్టర్, ఎస్పీలకు ఆహ్వానం

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించనున్న శివ కల్యాణ మహోత్సవానికి కలెక్టర్, ఎస్పీలతో పాటు ఇతర అధికారులకు కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను శుక్రవారం అందించారు. వారి వారి కార్యాలయాల్లో జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరేలతో పాటు భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్, చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్‌లకు శాలువాతో సత్కరించి ఆలయ చిత్రపటాన్ని బహూకరించి ఆహ్వాన పత్రికను అందించారు. కార్యక్రమంలో కోటగుళ్ల పరిరక్షణ కమిటీ సభ్యులు శ్రీనివాస్, గౌతమ్, ఆలయ అర్చకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలి

- ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలి
- వ్యవసాయ, ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్షలో కలెక్టర్ రాహుల్‌శర్మ


మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రబీ పంటలకు అవసరమైన నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం భూపాలపల్లి కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పంటలకు సమృద్ధిగా సాగునీరు అందించాలన్నారు. సమయానికి సాగునీరు అందించేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలన్నారు. పంటలు ఎండిపోకుండా స్థానిక పరిస్థితులను పరిగణలోకి తీసుకొని సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యత్యాసం లేకుండా సాగు వాస్తవ నివేదికలు అందజేయాలన్నారు. జిల్లాలో గత రబీసీజన్‌లో 86ఎకరాల్లో సాగు అయిందని, ఈ ఏడాది 82 ఎకరాల్లో పంట సాగు అవుతుందన్నారు. అక్రమ నీటి వినియోగాన్ని అరికట్టేందుకు పర్యవేక్షణ చర్యలు చేపట్టాలన్నారు. యూరియా కొరత రాకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. టాస్క్‌ఫోర్స్ టీంలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తూ స్టాకు వివరాలు పరిశీలించాలన్నారు. వ్యాపారులు ఎరువుల నిల్వ వివరాలు నోటీస్ బోర్డ్‌పై ప్రదర్శించాలన్నారు. జిల్లాకు 25వేల టన్నుల యూరియా వచ్చిందని అదనంగా మరో 5వేల టన్నుల యూరియా వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఆధార్ నమోదుతో మాత్రమే యూరియా ఇవ్వాలన్నారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే పీడీయాక్ట్ నమోదు చేయాలని పేర్కొన్నారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఏవో విజయ్‌భాస్కర్, ఇరిగేషన్ ఈఈలు బసవప్రసాద్, యాదగిరి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కాల్వ పారదు.. మడి తడవదు!

(5వ పేజీ తరువాయి)

వరకు పంటకాల్వ పొడవునా రోడ్డునిర్మాణం కోసం ఆ ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. సరస్సు వద్ద నిత్యం పర్యవేక్షణ కోసం 20మంది లష్కర్లతోపాటు మరో ఇద్దరు వాచ్‌మెన్‌లను నియమించాలని కూడా ప్రతిపాదించారు.

తూములకు తాత్కాలిక మరమ్మతులు

గతేడాది జూన్‌లో తూముల లోపల రాళ్లు కూలిపడ్డాయి. దీంతో నీళ్లు భారీగా లీకయ్యాయి. అప్రమత్తమైన నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే రూ.22లక్షలతో తాత్కాలికంగా మరమ్మతు చేశారు. నైజాం కాలంలో అవలంభించిన పద్ధతులను పాటిస్తూ డంగుసున్నం, కరక్కాయ, బెల్లం మిశ్రమాన్ని ఉపయోగించి రిపేర్ పనులు పూర్తిచేశారు. ఇందుకోసం చెరువులోని నీటినంతా బయటకు వదిలారు. ఈ చర్యలు తాత్కాలికంగా ఉపశమనం కలిగించినప్పటికీ మళ్లీ రాళ్లు కూలిపోయే ప్రమాదం లేకపోలేదు. ఇటు వ్యవసాయ పరంగా, అటు పర్యాటకంగా బహుళ ప్రయోజనకారిగా ఉన్న లక్నవరం చెరువును పరిరక్షించేందు కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

వృథాను అరికడితే రెండు పంటలు

– శ్రీనివాస్, డీఈఈ

లక్నవరం చెరువు నీటి వృథాను పూర్తిస్థాయిలో అరికడితే ఆయకట్టులోని మొత్తం పొలాలలో ఏడాదికి రెండు పంటలు పండుతాయి. క్రితం ఏడాది తూముల లోపల మరమ్మతులు చేపట్టి కొంతమేరకు లీకేజీలను నిలువరించాం. రెండేళ్ల క్రితం రూ.300 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించాం.

అత్యాచారం కేసులో నిందితుడికి జైలుశిక్ష

గణపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జరిమానాతో పాటు జైలుశిక్ష ఖరారైనట్లు ఎస్సై అశోక్ శుక్రవారం తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన పున్నం రంజిత్ 2022 జూలై 4న ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడడంతో అప్పటి ఎస్సై నిందితుడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి నారాయణబాబు ఇరువురి వాదనలు విన్న నేపథ్యంలో నేరం రుజువు కావడంతో నిందితుడు రంజిత్‌కు రూ.20వేల జరిమానా, 20ఏళ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సొసైటీ డైరెక్టర్ పదవుల కోసం ఎన్నికలు

మహదేవపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 24న గిరిజన ప్రైమరీ కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ పదవుల కోసం ఎన్నికలు జరుగనున్నట్లు గిరిజన ప్రైమరీ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల అధికారి శైలజ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గిరిజన స్త్రీ,పురుష ఓటర్లు అందరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఆమె తెలిపారు. పోలింగ్ సమయంలో ఓటర్లు తమ వెంట ప్రభుత్వం గుర్తించిన గుర్తింపు కార్డులు ఏదైనా ఒకటి తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

పత్తి పంటను కొనుగోలు చేయాలి

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సీసీఐ ద్వారా పత్తి పంటను కొనుగోలు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్డీ.అమ్జద్‌పాషా ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంపత్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమ్జద్‌పాషా మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో 15వేల ఎకరాల్లో పత్తిపంట సాగు అయిందని, అధిక వర్షాల వల్ల పంట ఆలస్యంగా రావడం జరిగిందని అన్నారు.

ఎర్రగుంటపల్లిలో నీటి ఎద్దడి నివారణ చర్యలు

కాటారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంటపల్లిలో పంచాయతీ అధికారులు నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టారు. ఇటీవల బోర్‌మోటార్ కాలిపోవడంతో మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా చేసినప్పటికీ ప్రజలు నీటి ఇబ్బందులు పడ్డారు. దీంతో మండల ప్రత్యేకాధికారి నరేష్, ఎంపీవో వీరస్వామి ఆదేశాల మేరకు కాలిపోయిన మోటార్ రిపేర్‌కు అనుకూలంగా లేకపోవడంతో కార్యదర్శి సమీర్‌ఖాన్ నూతన మోటార్‌ను శుక్రవారం సిబ్బందితో బిగింపజేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

ములుగు కలెక్టరేట్/భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27వ తేదీన జరిగే వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్ నుంచి ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర, పోలీస్ ఉన్నతాధికారులు, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీకిరణ్ ఖరేలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, పోలింగ్ స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. పోలింగ్ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించాలని, జిల్లాలో ఎన్నికలప్రవర్తన నియమావళి పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. వీసీలో ఓఎస్డీ మహేష్ బాబాసాహెబ్ గీతే, ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ విజయభాస్కర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సలీం పాల్గొన్నారు.

పోచంపల్లిలో సేవాలాల్ జయంత్యుత్సవాలు


పోచంపల్లిలో సేవాలాల్ జయంతిని నిర్వహిస్తున్న లంబాడీలు

మహాముత్తారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోచంపల్లి గ్రామంలో సద్గురు సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వంమంథని నియోజకవర్గంలోని మహాముత్తారం మండలాన్ని అధికారికంగా జయంతి జరుపుకోవడానికి ఎంపిక చేసింది. ఈ సందర్భంగా తండా నాయకుడి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని తండాలకు చెందిన లంబాడీలు ఉత్సవాన్ని జరుపుకొంటూ సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు. భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.శ్రీనివాస్, కుల పెద్ద గోపినాయక్, లంబాడ కుల పెద్దలు పడ్తీనాయక్, ధన్‌సింగ్, రాజారాంనాయక్, నవ్‌రాంనాయక్, వంశీరాజ్, మంగునాయక్, రుబీన్, భాస్కర్ నాయక్, నాయకులు పక్కల సడువలి, సుగుణాకర్‌రావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వల్ల అనర్థాలపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ దివాకర


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ టీఎస్.దివాకర సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు జరుగకుండా వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, టాస్క్‌ఫోర్స్ స్పెషల్ బ్రాంచ్ పోలీసులు డ్రగ్స్‌పై క్షేత్రస్థాయిలో నిఘా పెట్టాలన్నారు. కేవలం పోలీస్ శాఖ మాత్రమే కాకుండా ఆబ్కారీ శాఖ అధికారులు కూడా మాదకద్రవ్యాల నిషేధంపై కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అదే విధంగా జిల్లా విద్యాశాఖ అధికారి, ఇంటర్ ఎడ్యుకేషన్ అధికారి నేతృత్వంలో ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని, జిల్లా వైద్యశాఖ అధికారులు సైతం ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు నెలవారీ సమావేశాల్లో డ్రగ్స్ నిషేధంపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇకముందు జరిగే యాంటీ నార్కోటిక్ సమావేశాలకు ఆయాశాఖల ఆధ్వర్యంలో డ్రగ్స్ నిషేధంపై నిర్వహించిన కార్యక్రమాల నివేదికను తయారుచేసి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో వెంకటేష్, డీసీఆర్‌బీ డీఎస్పీ కిషోర్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, డీఈవో, వైద్య ఆరోగ్య శాఖ అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.